క్లుప్తంగా

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: ఈనెల 29న జరిగే మహాసభల కరపత్రాలను సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గోపాల్, రమణాశెట్టి, ఎల్లా నాయుడు, పుల్లన్న, దుబ్బన్న, నాగరాజు, రాజేష్, చిట్టిబాబు, సుమంత్ శుక్రవారం ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడుతూ మహసభలకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

పీవీ రావు సేవలు మరువలేనివి



పీవీ రావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: మాలల ఆశా జ్యోతి పీవీ రావు సేవలు మరువలేనివని మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షులు ఏసీ నాగేష్ అన్నారు. శుక్ర వారం మాలమహానాడు కార్యాలయంలో పీవీ రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ, మాలమహానాడు నాయకులు పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు రమణ, మాలమహానాడు నాయకులు డాక్టర్ రాజు, మనోహర్, చంద్రన్న, జైపాల్, రాజు, దానం, మహేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ప్రసాద వితరణకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన సి.వి.వాసుదేవరాయ్ రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. దాతకు దేవస్థానం తరపున పర్యవేక్షకురాలు పి.దేవిక స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

వేతనాలు పెంచాలి



మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కొత్తపల్లి: వేతనాలు పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఈ హరిత డిమాండ్ చేశారు. శుక్రవారం అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండులోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి, దుద్యాల సెక్టార్ల నాయకురాళ్లు నాగమణి, రాజమ్మలు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కామేశ్వరీదేవికి బంగారు తిలకం



బంగారు తిలకం అందిస్తున్న దాత

మహానంది: విశ్వబ్రాహ్మణ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, నంద్యాల పట్టణానికి చెందిన పూలకుంట అరుణాచారి, కుటుంబ సభ్యులు శుక్రవారం కామేశ్వరీదేవి అమ్మవారికి రూ.20 వేల విలువైన బంగారు తిలకం విరాళంగా అందజేశారు. ముందుగా వారు కామేశ్వరిదేవిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక దేవస్థానం కార్యాలయానికి చేరుకుని ఏఈఓ మధు, ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడుకు బంగారు తిలకాన్ని అందించారు.

పోషణ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న ఈఓపీఆర్డీ

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, కార్యదర్శి శాంతయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ పోషణ కిట్లను గర్భిణీ, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని జీఎస్ ఎంకే, పాదుపు మహిళలకు సూచించారు. గ్రామాల్లోని చిన్నారులు, గర్భిణి, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు.

ఘనంగా గణితశాస్త్ర దినోత్సవం



రామానుజన్ చిత్ర పట్టానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వడ్డెమానులో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఉపాధ్యాయులు

నందికొట్కూరు/రూరల్: జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన గణిత శాస్త్రంలో చేసిన పరిశోధనల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని పలువురు ఆకాంక్షించారు. మండలంలోని వడ్డెమాను జెడ్పీ హైస్కూల్‌లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్ఏ 1లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండల కేంద్రంలోని శ్లోక స్కూల్‌లో కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు.

● **మిడుతూరు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూర్బాబాలికల విద్యాలయం, శ్రీ లక్ష్మీ ఇంగ్లీష్ మీడియం స్కూలులో శ్రీ రామానుజన జయంతి (గణిత దినోత్సవం) వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కేజీబీవీ, శ్రీ లక్ష్మీ ఇంగ్లీష్ మీడియం స్కూలులో గణిత దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన గణిత మేళా నమూనాలను ఎంఈఓ -2 శ్రీనాథ్ పరిశీలించారు.

● **జూపాడుబంగ్లా:** గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతిని మోడల్ పాఠశాల, తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. గణితంలో విద్యార్థులు తయారుచేసిన చార్టులు, ప్రాజెక్టుల ప్రదర్శ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, తరిగోపుల జిల్లా పరిషత్ హెచ్ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకులు ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో, ప్రగతి హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయులు మురళీకృష్ణ, శ్రీధర్, మేరీల ఆధ్వర్యంలో జాతయ గణితశాస్త్ర దినోవత్సాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.వెంకట నరసయ్య, ప్రగతి హైస్కూల్ కరస్పాండెంట్ రాధాకృష్ణ ఉపాధ్యాయ, అధ్యాపక బృందాలతో కలిసి శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.పద్మావతిబాయి, వైజిష్ణు, విజయ్, హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు సంజీవయ్య, రామసుబ్బయ్య, షహనా పాల్గొన్నారు.

● **పగిద్యాల:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు అధ్యక్షతన గణిత దినోత్సవాలను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాసు, శైలకుమారి, ఉల్ఫతున్నీసా, రమేష్, కరిముల్లా, పీడీ కృష్ణ, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి ఉన్నారు.



పగిద్యాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

● **శ్రీశైలంప్రాజెక్ట్:** గణిత శాస్త్ర మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతిని శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్.పి. హుస్సేన్‌బాషా, గణితశాస్త్ర అధ్యాపకురాలు జి.వై. వి.కళ్యాణి మాట్లాడుతూ గణితశాస్త్రంలో అధ్యయనం చేసి నూతన సరళీకృత విధానాలను ప్రపంచానికి పరిచయం చేసిన మేధావి శ్రీనివాస రామానుజన్ అన్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.



నృత్యప్రదర్శనలో విద్యార్థినులు



ప్రగతి హైస్కూల్‌లో రామానుజన్‌కు నివాళులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హుస్సేన్‌బాషా



మిడుతూరులో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

నేడు వైకుంఠ ఏకాదశి వేడుకలు

మహానంది: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం మహానంది క్షేత్రంలో వేడుకలు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడుతూ మహానందిలోని కోదండ రాముడిని శ్రీకృష్ణ అవతారంలో అలంకరించి ఉత్తర ద్వారంలో కొలువు చేస్తామన్నారు. భక్తులకు ఉదయం నాలుగున్నర గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. నంద్యాల పార్లమెంటు సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రత్తి కనీస మద్దతు ధర రూ.6,620(పొట్టి పింజ రకం), రూ.7,020 (పొడవు పింజరకం) కంటె తక్కువ ఉందన్నారు. దీంతో ప్రభుత్వం నంద్యాలలోని శ్రీ మురారి పవన్ ఆగ్రో టెక్ జిన్నింగ్ మిల్లు, ఏయన్‌సీ ఆగ్రో మిల్లు, మారం లక్ష్మీనారాయణ కాటన్ ఇండస్ట్రీస్‌లలో కాటన్ కార్పొరేషన్ వారి సమన్వంతో పత్తికొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకొని పత్తి దిగుబడులను విక్రయించుకోవాలని సూచించారు. తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

మహానంది: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బండిఆత్మకూరు ఈఓఆర్డీ శ్రీనివాసులు అన్నారు. నారాయణపురం గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మద్దిలేటి పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నందికొట్కూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి పీడీ ఏసుదాసు సూచించారు. శుక్రవారం మండలంలోని అల్లూరు, వడ్డెమాను గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పథకాలకు సంబంధించిన వీడియో సందేశాలను వారికి చూపించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మయ్య, ఈఓఆర్డీ సంజన్న, ఏపీఓ అలివేలుమంగమ్మ, కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నందికొట్కూరు రూరల్: శనగ పైరులో సస్య రక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించుకోవాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మల్యాల గ్రామ పరిధిలోని పొలాల్లో పొలంబడి కార్యక్రమాన్ని పరిశీలించారు. శనగలో క్షేత్ర ప్రయోగాలు నిర్వహించి మొక్కల సాంద్రత, నీటి నిల్వ సామర్థ్య పరీక్షలను నిర్వహించి బ్యాలెట్ బాక్స్ పరీక్షలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏఓ షేక్షావలి, జిల్లా వనరుల కేంద్రం అధికారి శశిధరరెడ్డి, ఆత్మ బీటీఎం చక్రవర్తి, వీఏఏ శాంతిరాజు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ డీపీడీ శ్రీలత

కనుల పండువగా మహానందీశ్వర పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పండితులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల భక్తులు ఉత్సవంలో పాల్గొని స్వామివారి పల్లకీని మోస్తూ భక్తిని చాటుకున్నారు.

నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యా బోధన

మిడుతూరు: ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులచే బోధన సాగుతుందని, ప్రభుత్వ కళాశాల్లో అడ్మిషన్లు పొందాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ సూచించారు. శుక్రవారం గడివేముల మండలంలోని గని, మండల పరిధిలోని చౌట్కూరు, కడుమూరు, దేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మిడుతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పొంది చక్కటి విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట అధ్యాపకులు ప్రభాకర్ రావు, వెంకటేశ్వరరెడ్డి, ఎల్లన్న, భీముడు నాయక్ ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్ నాయక్

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

చాగలమర్రి: స్థానిక కోటగడ్డ వీధికి చెందిన ఆటో డ్రైవర్ ఉచ్చుసాగారి హమద్‌బాషా (45) ఆటోలోనే నిద్రిస్తూ గుండెపోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు హమద్‌బాష గత కొన్నేళ్ళుగా స్వంతంగా ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి భార్య ఉమేరా, ముగ్గురు సంతానం ఉన్నారు. రోజులాగే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి ఆటో తీసుకెళ్లాడు. మధ్యాహ్నం స్థానిక కేరళా ఆసుపత్రి వద్ద నలతగా ఉందని తోటి డ్రైవర్‌లతో చెప్పి ఆటోలోనే నిద్రపోయాడు. కొద్ది సేపటికి అక్కడే ధర్నా చేస్తున్న అగన్‌వాడీ కార్యకర్తలు అనుమానంతో కేరళా ఆసుపత్రికి తీసుకెళ్ళగా వైద్యులు పరిశీలించి మృతి చెందాడని ధ్రువీకరించారన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నంద్యాలకు పతకాలు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని నంద్యాలకు పతకాలు లభించాయని తైక్వాండో ఉమ్మడి జిల్లాల అసోసియేషన్ ప్రెసిడెంట్ సుందర్‌రాజు, సెక్రటరీ మహబూబ్‌బాషా శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈనెల 16, 17 తేదీల్లో గుంటూరు జిల్లా రేపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ క్యాడెట్ తైక్వాండో పోటీల్లో 11 మంది విద్యార్థులు పాల్గొనగా 8 మంది ప్రతిభ చూపారన్నారు. జిల్లాకు ఒక స్వర్ణం, మూడు రజత, నాలుగు కాంస్య పతకాలు సాధించి జిల్లాకు పేరు తెచ్చారన్నారు. జంషీద్ హుసేన్ అండర్-53 కేజీ క్యాడెట్‌విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. సబ్ జూనియర్ విభాగంలో జంషీద్ హుసేన్‌కు స్వర్ణం, బీవీ హర్షిత, అంజలి(రజత), అద్వైత(కాంస్య), ఎం.బ్లషీ(కాంస్య), కమల్‌నాథరెడ్డి(కాంస్య) పతకాలు సాధించగా క్యాడెట్ విభాగంలో అస్మా(రజత), కమల్‌నాథరెడ్డి(కాంస్య), బ్రహ్మతేజ(కాంస్య) పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ఈసీ మెంబర్ ఉదయ్‌కిరణ్‌తో కలిసి అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

ఆడుదాం..ఆంధ్రాకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

నందికొట్కూరు: ఆడుదాం ఆంధ్రాకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్ సూచించారు. శుక్రవారం జిల్లా పరిషత్ హైస్కూల్(కోటా), గవర్నమెంట్ హైస్కూల్ గ్రౌండ్స్‌ను, ప్రభుత్వ వైద్యశాల సమీపంలో కుంట వద్ద ప్లే గ్రౌండ్స్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీలకు ప్లే గ్రౌండ్స్‌తో పాటు క్రీడాకారులకు అన్ని వసతులు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాలమద్దయ్య, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

● **పగిద్యాల:** ఈనెల 26 నుంచి అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించే ఆడుదాం .. ఆంధ్రా క్రీడాపోటీలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు ఆన్‌లైన్ స్కోరింగ్‌పై వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, శ్రీధర్‌కుమార్ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఆడుదాం.. ఆంధ్రాకు సంబంధించిన యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏపీ క్రీడలకు స్కోర్ ఎలా నమోదు చేయాలో వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పోటీల నిర్వహణలో సమస్యలు ఎదురైతే వెంటనే మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ క్రీడాపోటీలను గ్రామ స్థాయి నుంచి నిర్వహిస్తోందని, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, సమతయశోదర, జావేద్, ఖాసీం సాహెబ్, వీరన్నయాదవ్, శ్వేత, ఇషామ్‌బాషా, కోట్ల వెంకటేష్ పాల్గొన్నారు.

● **మహానంది:** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బండిఆత్మకూరు మండల ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. శుక్రవారం మండల స్థాయి అధికారులతో కలిసి బండిఆత్మకూరులోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. 26వ తేదీ నుంచి పోటీలు ఉంటాయన్నారు.



గ్రౌండును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్

మహానందీశ్వరుడి సన్నిధిలో ఐపీఎస్ అధికారి

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో ఐఏఎస్ అధికారి(ఏపీ అకౌంట్స్ శాఖ) భాస్కర్‌రెడ్డి దంపతులు శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఏఈఓ మధు స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేశారు. స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనాలు చేయించారు.

పాత సామగ్రి వేలం

శ్రీశైలంప్రాజెక్ట్: గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలోని పాత సామగ్రిని వేలం వేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. పాత వంటపాత్రలు, ఫర్నిచర్, ఇతర వస్తువులను పాఠశాల ప్రాంగణంలో ఈనెల 28న మధ్యాహ్నం బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలన్నారు.

కళ్లద్దాల పంపిణీ

జూపాడుబంగ్లా: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వైద్య సేవలు పొందిన తాటిపాడు గ్రామానికి చెందిన పలువురికి ప్రభుత్వం ద్వారా మంజూరైన కళ్లద్దాలను డాక్టర్ గంగాధర్ శుక్రవారం అందజేశారు. మండల వ్యాప్తంగా 121 మందికి మంజూరయ్యాయని డాక్టర్ గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కరుణ పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతి

నంద్యాల(అర్బన్): బిల్లలాపురం గ్రామ తలారి (వీఆర్ఏ) మండ్ల సుబ్బడు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, వీఆర్ఓలు, వీఆర్ఏలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ.15వేలు, వీఆర్ఏ అసోసియేషన్ నుంచి రూ.5వేలు కుటుంబ సభ్యులకు అందించారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

నందికొట్కూరు: అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా నాయకులు రఘురామమూర్తి అన్నారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు, ఆయాలకు వేతనాలు పెంచే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. అంగన్‌వాడీలకు న్యాయమైన వేతనాలు పెంచాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జీతాలు పెంచి ఆదుకోవాలని కోరారు. గ్రాట్యూటీ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు రమేష్, అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులు పుణ్యవతి, నాగేశ్వరమ్మ, కమలమ్మ, సువర్ణ, కాత్యాయని పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

శ్రీశైలంప్రాజెక్ట్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తలపెట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. రింగ్‌పార్క్ సెంటర్ వద్ద హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ నాయకురాళ్లు రమణమ్మ, కాశమ్మ మాట్లాడుతూ న్యాయమైన అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుండా, వలంటీర్లతో అంగన్‌వాడీ సెంటర్‌లను బలవంతంగా నడుపుతున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీ దీక్షలకు పలు కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి.



రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఘనంగా సెమీ క్రిస్మస్

కొత్తపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు దీపానాగవేణి, సీహెచ్‌ఓ బాలకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి ముందస్తు వేడుకలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విజయేంద్రవర్మ, బుబేదా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

వెలుగోడు: పట్టణంలోని ఆర్సీఎం చర్చిలో శుక్రవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాదర్ సతీష్ క్రీస్తు జననం గురించి వివరించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.



వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

హాస్టళ్లలో వసతుల కల్పనకు కృషి

నంద్యాల(అర్బన్): సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులకు ప్రతిపాదనలు పంపితే పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక బొమ్మలసత్రం వద్ద ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సమీకృత బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనాన్ని పరిశీలించారు. వసతి గృహంలో ఫ్లోరింగ్ దెబ్బతినడం, గదులు వెలుస్తుండటం, తదితరాలను వార్డెన్ సువర్ణ జేసీ దృష్టికి తెచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపితే పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి లక్ష్మీదేవి ఉన్నారు.

డాక్టర్ రవికృష్ణకు పురస్కారం

నంద్యాల టౌన్: ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈ సంవత్సరంలో డాక్టర్ జి.రవికృష్ణ రాష్ట్రంలో సభ్యుల సంఖ్యను పెంచేందుకు, వివిధ వైద్య విద్యా సదస్సులు, వైద్య సేవా కార్యక్రమాలు, వైద్యుల సమస్యల పరిష్కారంలో చేసిన కృషికి జాతీయ ఐఎంఏ ఉత్తమ రాష్ట్ర అధ్యక్షుడిగా జాతీయ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ఆయన శుక్రవారం తెలిపారు. ఈనెల 27న తిరువనంతపురంలో నిర్వహించనున్న 98వ జాతీయ ఐఎంఏ సదస్సులో పురస్కారాన్ని అందజేస్తారని చెప్పారు.